సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



నమో వేంకటేశా

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శని వారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అన్ని విభాగాలూ కిటకిటలాడాయి.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మొలడ్రేటి వెంకటరంగ ప్రసాద్ (రాజమండ్రి), ఎం.వెంకట సూర్యప్రకాష్ (విజయనగరం) రూ.1,00,116 చొప్పన విరాళంగా అందజేశారు.

లక్ష మల్లెల పూజ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారువారి చెరువు గట్టున కొలువైన మావూరమ్మ ఆలయంలో శనివారం జాతర ఉత్సవాల్లో భాగంగా లక్ష మల్లెల పూజ నిర్వహించారు.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆదివారం సాయంత్రం)	సహరి (సోమవారం వేకువజాము)
భీమవరం	6.25	4.31
తాడేపల్లిగూడెం	6.27	4.40
నరసాపురం	6.24	4.31

న్యూస్‌రీల్

పకడ్బందీగా 'పది' పరీక్షలు



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

పాలకోడేరు/అత్తిలి: పదో తరగతి పరీక్షల్లో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని పర్యవేక్షించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శనివారం పాలకోడేరు మండలం పాలకోడేరు, మోగల్లు హైస్కూళ్లు, అత్తిలి మండలం ఆరవల్లి హైస్కూళ్లలో పరీక్షల తీరును ఆమె పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, ఎక్కడా పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. అన్ని కేంద్రాల వద్ద సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఆరవల్లిలో సీసీ టీవీల ద్వారా పరీక్షల తీరును రాష్ట్ర పరిశీలకుడు కె.రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వైద్య శిబిరాలను పరిశీలించి మందులపై ఆరా తీశారు. ఆమె వెంట డీఈఓ ఆర్.వెంకటరమణ, పాలకోడేరు తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ ఎంఎస్ గంగాధరరావు, పరీక్షల నిర్వహణ అధికారి వైఎస్సార్‌సీఎం దత్, హెచ్‌ఎంలు ఉన్నారు.

98.47 శాతం హాజరు

సాక్షి, భీమవరం: జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లిష్ పరీక్షకు 98.47 శాతం విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. 20,658 మందికి 20,338 మంది హాజరయ్యారన్నారు. మూడు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయగా 34 కేంద్రాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్, 5 కేంద్రాల్లో జిల్లా స్థాయి పరిశీలకులు తనిఖీ చేశారన్నారు.

కెమెరాకు చిక్కాడు

ఆచంట మండలం మటపర్తివారిపాలెంలోని కేంద్రంలో భీమలాపురం గ్రామానికి చెందిన విద్యార్థి మాస్ ప్రాక్టీస్ చేస్తున్నట్టు భీమవరం కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ ద్వారా పసిగట్టారు. పరీక్షా కేంద్రంలోని సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తుండగా ఓ విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ చేస్తున్నట్టు గుర్తించి వెంటనే స్క్వాడ్ ద్వారా తనిఖీ చేయించారు. విద్యార్థిని తనిఖీ చేసి స్లిప్పులు పెట్టినట్టు గుర్తించి డిబార్ చేయడంతో పాటు ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 12 నుంచి రక్తదాన శిబిరాలు



మాట్లాడుతున్న పుష్పరాజ్

సాక్షి, భీమవరం: బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా భీమవరం ఏఎస్ఎన్ రాజు చారిట్రబుల్ ట్రస్ట్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నట్టు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తెలిపారు. శనివారం భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 30 వరకు పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించే రక్తదాన శిబిరాల్లో అంబేడ్కర్ అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సమాజ సేవలో ముందుండాలని కోరారు. ఏఎస్ఎన్ రాజు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, రాష్ట్ర కార్యదర్శి సంది జయరాజు , నన్నేటి నాగరాజు, ప్రసాదరావు, పిట్టా వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఐపీఎస్‌ల బదిలీలు

- ఏలూరు రేంజ్ డీఐజీగా అశోక్‌కుమార్
- ప్రస్తుత డీఐజీ పాలరాజు గుంటూరు రేంజ్‌కు..
- ఏలూరు ఎస్పీగా మేరీ ప్రశాంతి
- ప్రస్తుత ఎస్పీ ఏపీఎస్‌పీ బెటాలియన్‌కు..
- వచ్చే వారం బాధ్యతల స్వీకరణ



ప్రస్తుత డీఐజీ పాలరాజు



ప్రస్తుత ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ



కొత్త డీఐజీ అశోక్‌కుమార్



కొత్త ఎస్పీ మేరీ ప్రశాంతి

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఏలూరు రేంజ్ నూతన డీఐజీగా 2006 బ్యాచ్‌కు చెందిన జీవీజీ అశోక్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుత డీఐజీ జి.పాలరాజు గుంటూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. అలాగే ప్రస్తుత ఏలూరు ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఏపీఎస్‌పీ 5 బెటాలియన్ కమాండెంట్‌గా విజయనగరానికి బదిలీ కాగా ఆయన స్థానంలో డి.మేరీ ప్రశాంతి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్‌లను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే వారంలో ఇద్దరు అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

వివాదరహితుడిగా అశోక్‌కుమార్

2006 బ్యాచ్‌కు చెందిన అశోక్‌కుమార్ కడప, అనంతపురం ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, తిరుమల తిరుపతి దేవస్థానంలో, రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ డీసీపీగా పనిచేశారు. మూడున్నరేళ్ల నుంచి ఏసీబీ, అడిషనల్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఏసీబీలో ఉండగా డీఐజీ పదోన్నతి లభించింది. ఈ క్రమంలో డీఐజీ హోదాలో ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. మరో వారం రోజుల్లో విధుల్లో చేరనున్నారు. వివాదరహితుడిగా శాఖాపరంగా మంచి పేరు ఉండటంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో కీలక కేసులు ఛేదించారు. కడప, అనంతపురం ఎస్పీగా విధులు నిర్వహించిన క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు.

గంజాయిపై పాలరాజు ఉక్కుపాదం

ఏలూరు రేంజ్ ప్రస్తుత డీఐజీ జి.పాలరాజు గుంటూరు రేంజ్ డీఐజీగా బదిలీ అయ్యారు. గతేడాది ఏప్రిల్ 4న ఏలూరు రేంజ్ డీఐజీగా బాధ్యతలు స్వీకరించి పరిపాలనాపరంగా తనదైన ముద్ర వేసుకున్నారు. ప్రధానంగా రేంజ్ పరిధిలోని అమలాపురంలో జరిగిన ఘర్షణను అదుపులోకి తెచ్చి శాంతిభద్రతలను పరిరక్షించడం, ఎమ్మెల్యేపై దాడి ఘటనపై సీరియస్‌గా వ్యవహరించడం, అలాగే ప్రధానమంత్రి భీమవరం పర్యటన సందర్భంగా బందోబస్తు స్వయంగా పర్యవేక్షించడం వంటి చర్యలతో సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. విధి నిర్వహణలో రాజీపడకుండా వ్యవహరించారు. గంజాయి అక్రమ రవాణా కట్టడిపై ఎక్కువ దృష్టి పెట్టి ఏలూరు రేంజ్ పరిధిలో లక్షల కిలోల గంజాయిని సీజ్ చేసి ధ్వంసం చేశారు. అలాగే పోలీస్‌స్టేషన్లల్లో రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవంగా సిబ్బంది మెలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పోక్సో యాక్ట్, కీలక కేసుల్లో వెంటనే శిక్షపడేలా చర్యలు తీసుకున్నారు. శాఖాపరంగా అవినీతిపై ఉక్కుపాదం మోపారు. సిబ్బంది పనితీరుపై ఫిర్యాదు వస్తే వెంటనే విచారించి చర్యలు తీసుకున్నారు. ఏడాది పదవీ కాలంలో దాదాపు 17 మంది ఎస్సైలు, సీఐలకు వీఆర్, సస్పెన్షన్ వేటు వేశారు.

సారా నిర్మూలనపై ప్రత్యేక ఫోకస్

ప్రస్తుత ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ 2021 జూలై 15న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల విభజన నేపథ్యంలో ఏలూరు ఎస్పీగా కొనసాగారు. ప్రధానంగా జిల్లాలో కోడిపందేల కట్టడి, సారా నిర్మూలనపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంతో పాటు సారా తయారీదారులకు స్వయం ఉపాధి కల్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శాఖాపరంగా సిబ్బంది సంక్షేమంపైనా దృష్టి సారించి వివాదరహితుడిగా ఆయన కొనసాగారు.

20 ఏళ్ల తర్వాత మహిళా ఎస్పీ

2013 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన పి.మేరీ ప్రశాంతి ఏలూరు ఎస్పీగా నియమితులయ్యారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఏలూరుకు మహిళా ఐపీఎస్ అధికారి ఎస్పీగా నియమితులయ్యారు. ప్రస్తుతం మేరీ ప్రశాంతి విజయవాడ కమిషనరేట్‌లో లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేస్తున్నారు. ట్రైనీ డీఎస్పీగా మేరీ ప్రశాంతి కొంతకాలం పనిచేశారు. ఆమె విజయనగరం, మహబూబ్‌నగర్ డీఎస్పీగా పనిచేసి విజయవాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా, అనంతరం సీఐడీలో ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం విజయవాడ కమిషనరేట్‌లో లా అండ్ ఆర్డర్ డీసీపీగా ఉన్నారు. వచ్చే వారంలో ఏలూరు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

● మనవడా.. మళ్లీ నువ్వే రావాలి



తమ జీవితాల్లో సంక్షేమ కాంతులు నింపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వృద్ధులు నీరాజనాలు పడుతున్నారు. వృద్ధాప్యంలో మనవడిగా ఆసరాగా ఉంటున్న సీఎంకు ధన్యవాదాలు చెబుతున్నారు. శనివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడులో తన ఇంటి వద్ద అతికించిన జగన్ పోస్టర్‌ను చూసి మనవడా.. మళ్లీ నువ్వే రావాలి అంటూ నమస్కరిస్తున్న వృద్ధురాలి దృశ్యమిది.
-పెదపాడు

బాలికలతో బాలుర అసభ్యకర ప్రవర్తన

బాలికల తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

సాక్షి, భీమవరం: ఇద్దరు బాలికలపై ముగ్గురు బాలురు లైంగిక దాడి చేశారంటూ బాధిత బాలికల తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను శనివారం చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉపాధి కోసం ఇతర జిల్లా నుంచి వచ్చిన ఒక కుటుంబం పట్టణంలోని మెంటేవారితోట ప్రాంతంలో నాలుగు నెలలుగా అద్దెకు ఉంటోంది. ఈ నెల రెండో తేదీన నాలుగు, ఐదేళ్ల వయస్సు కలిగిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు తమ ఇంటికి సమీపంలో ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల వయస్సు కలిగిన ముగ్గురు బాలురు అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించారు. మరుసటి రోజు బాలికలు నీరసంగా ఉండడంతో తల్లి ఆరా తీయగా తమపై జరిగిన లైంగిక దాడి యత్నాన్ని వివరించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దిశ డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ సంఘటనా ప్రాంతంలో వివరాలను సేకరిస్తున్నారని సీఐ శ్రీను చెప్పారు.

● సంక్షేమ కాంతులు



ఇరగవరం : కాకిలేరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

నీళ్ల ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

17 మందికి గాయాలు

ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద జాతీయ రహదారిపై నీళ్ల ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో 17 మందికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన రావులపాలెం డిపో బస్సు ఏలూరు వెళుతుండగా మార్గమధ్యలో నాచుగుంట వద్ద హైవేపై మొక్కలకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బస్సులోని 17 మందికి గాయాలు కాగా వీరందరినీ తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రయాణికులు కాండ్రేగుల వెంకటరమణ, నువ్వుల సాత్విక (తిరణంపాలెం), గొట్ట వెంకటలక్ష్మి (కంసాలిగుంట), గుర్రం నర్సింహమూర్తి (అన్నేవారిగూడెం), గున్నం నాగలక్ష్మి ఎం.సంధ్య (ఏలూరు), కొత్తపల్లి నాగేశ్వరరావు, డ్రైవర్ (వేంపాడు), టి.పద్మావతి, ఆకుల లక్ష్మి, ఆకుల రాము, ఈ.రంగ (ఏలూరు), నక్కపల్లి బంగారురాజు (గుండుగొలను), కె.రాజేశ్వరి (కడకట్ల), నాతిరెడ్డి సుబ్బాయమ్మ (ఐ.పంగిడి), ఎన్కే వరలక్ష్మి, గౌరీశంకర్ (రావులపాలెం), కె.దివ్య (తిరణంపాలెం)కు గాయాలు కాగా వీరందరినీ తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై స్వామి, ఏఎస్సై చౌదరి ప్రమాద స్థలిని పరిశీలించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.



ట్యాంకర్‌ను ఢీకొన్న రావులపాలెం డిపో బస్సు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

కోవిడ్‌తో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కుక్కునూరు: కోవిడ్ సోకడంతో తెలంగాణలోని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కుక్కునూరు మండలానికి చెందిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన పేరాల శంఖు (62) గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అతడికి ఇటీవల ఫిట్స్ రావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ముందుగా భద్రాచలం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అయినప్పటికీ నయం కాకపోవడంతో అక్కడి నుంచి ఖమ్మంలో రెండు ఆసుపత్రులలో చేర్చి చికిత్స అందించినట్టు సమాచారం. ఓ ఆసుపత్రిలో శంఖుకి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు సమాచారం. దీంతో కుటుంబసభ్యులు ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ విషయమై కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. శంఖు అనే వ్యక్తి కోవిడ్‌తో మృతి చెందిన విషయం వాస్తవమేనని చెప్పారు. శంఖుకి ఫిట్స్‌తో పాటు కాలికి సెర్ప్ అనే వ్యాధి రావడంతో కుటుంబసభ్యులు తెలంగాణలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్లి చికిత్స అందించారని, దీంతో అతనికి అక్కడే కోవిడ్ సోకినట్టు అనుమానం వ్యక్తం చేశారు. శంఖు మృతితో శనివారం కొండపల్లిలోని అతని కుటుంబసభ్యులకు ర్యాపిడ్ టెస్టులు నిర్వహించామన్నారు. ఈ టెస్టులలో అందరికీ నెగెటివ్ వచ్చిందన్నారు. అయినప్పటికీ కుటుంబసభ్యులను కొన్ని రోజులు హోమ్ ఐసోలేషన్‌లో ఉండాలని సూచించినట్టు చెప్పారు. శంఖు ఇంటి ఆవరణలో శానిటేషన్ చర్యలు చేపట్టామన్నారు.



పేరాల శంఖు కుటుంబసభ్యులకు ర్యాపిడ్ టెస్ట్ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

● సుందరంగా సమాధులు



లోకరక్షకుడు క్రీస్తు పునరుత్థానానికి చిహ్నంగా జరుపుకునే ఈస్టర్ పండుగకు క్రైస్తవ విశ్వాసులు సిద్ధమయ్యారు. ఆదివారం వేకువజామున ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు తమ పితృదేవతల సమాధులను శనివారం ముస్తాబు చేశారు. సమాధులకు రంగులు వేసి, పూలు, కొవ్వొత్తులు, అగరబత్తీలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉండిలోని శ్మశాన వాటికలో సమాధులను ముస్తాబు చేస్తున్న విశ్వాసుల దృశ్యమిది. - ఉండి

ఫ్యామిలీ డాక్టర్.. పేదల ఆరోగ్యానికి భరోసా

- ఈనెల 6న అధికారికంగా పథకాన్ని ప్రారంభించిన సీఎం జగన్
- జిల్లాలో ఇప్పటివరకు 1.63 లక్షల మందికి వైద్య సేవలు


కాళ్ల మండలం దొడ్డనపూడిలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

భీమవరం(ప్రకాశం చౌక్): పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మరింత అండగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టారు. గతేడాది అక్టోబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా ట్రయల్ రన్‌గా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించారు. నూతన పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ పథకం ట్రయల్ రన్‌గా 8 నెలల పాటు విజయవంతంగా నిర్వహించారు. ట్రయల్ రన్ సత్ఫలితాలు ఇవ్వడంతో ఈనెల 6న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ తగు చర్యలు తీసుకుంది.

ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవలు

గ్రామాల్లోకి ఉదయమే 104 వాహనంతో వైద్యులు, ఆరోగ్యశాఖ సిబ్బంది చేరుకుంటున్నారు. ఆయా గ్రామాల్లోని విలేజ్ క్లీనిక్ లేదా సచివాలయం వద్ద వైద్య సేవలు ప్రారంభిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు ఆ గ్రామంలోనే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మధ్యాహ్నం వరకు 104 వాహనం వద్దకు వచ్చే వారికి సేవలందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి గ్రామంలో ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకున్న పేషెంట్లు, కదల లేని స్థితిలో మంచం పై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వారిని పరీక్షిస్తున్నారు. గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు.


అత్తిలి మండలం అరవల్లిలో ఆరోగ్యశ్రీలో వైద్యం పొందిన పేషెంట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ పి.కిరణ్, వైద్య సిబ్బంది

అన్ని వర్గాల ప్రజలు చక్కగా ఉపయోగించుకుంటున్నారు

గత ప్రభుత్వంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలు అరకొరగా ఉండేవి. దాంతో చాలా తక్కువ మంది 104 వాహనం వద్దకు వచ్చి వైద్య సేవలు పొందేవారు. అవసరమైన మందులు ఉండేవి కావు. నేడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పూర్తిస్థాయిలో గ్రామంలోకి వచ్చి వైద్య సేవలు అందించడంతోపాటు పుష్కలంగా మందులు ఉండడంతో పేద, మధ్యతరగతి ప్రజలు వైద్య సేవలను చక్కగా ఉపయోగించుకుంటున్నారు.

తగ్గుతున్న వైద్య ఖర్చులు

గతంలో జర్వం, దగ్గు, జలుబు వంటి సాధారణ వ్యాధులు, బీపీ, సుగర్ వంటి వ్యాధులకు ప్రైవేట్ ఆస్పత్రులు, క్లీనిక్‌లకు వెళ్లి వేల రూపాయలు ప్రజలు ఖర్చు చేసేవారు. నేడు గ్రామాల్లోనే ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పరీక్షలు, వైద్యం, మందులు ఉచితంగా అందించడంతో ప్రజలకు ఆరోగ్యం కోసం చేసే ఖర్చు తగ్గింది.

అందుబాటులో వైద్య సిబ్బంది

ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఒక డాక్టర్, సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, డీఓ, హెల్త్ అసిస్టెంట్, ఫార్మాసిస్టు, ఆశ వర్కర్లు, 104 డ్రైవరు, తదితరు వైద్య సిబ్బంది పనిచేస్తున్నారు. 14 రకాల రక్త పరీక్షలు, 67 రకాల మందులను అందిస్తున్నారు.

జిల్లాలో 32 పీహెచ్‌సీల ద్వారా వైద్య సేవలు

జిల్లాలోని 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటి పరిధిలో 19 మండలాల్లోని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయా పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉంటారు. వారిలో ఒకరు పీహెచ్‌సీలో ఉండగా మరోకరు 104 వాహనంతో సిబ్బందితో కలిసి వెళ్లి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 64 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పథకంలో 1,63,896 మంది వైద్య సేవలు పొందారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఈ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం 8 నెలల ట్రయల్ రన్ విజయవంతమైంది. ఇకపై మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించేందుకు తగుచర్యలు తీసుకుంటున్నాం. ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వైద్యులకు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నాం.
– డి.మహేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, భీమవరం

అలరించిన సందేశాత్మక నాటికల ప్రదర్శన


ప్రక్షాళన నాటిక ప్రదర్శన


మృత్యుపత్రం నాటికలోని ఓ సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో అద్దేపల్లివారి సత్రం ప్రాంగణంలో విన్నకోట వెంకటేశ్వరరావు కళా వేదికపై 14వ జాతీయస్థాయి నాటిక పోటీలు రెండో రోజు కొనసాగాయి. శనివారం నాన్నా నేనొచ్చేస్తా, ప్రక్షాళన, మృత్యుపత్రం నాటికలను ప్రదర్శించారు. మన దేశంలో రోజురోజుకి మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయి. అమ్మాయిల జీవితాలతో ఆటలాడే వారిని బలిగొంటున్న కలుపు మొక్కల్ని ఏరిపారేసి సమాజాన్ని ప్రక్షాళన చేయాలనే సందేశంతో ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి ఆధ్వర్యంలో ప్రక్షాళన నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు.

'నాన్నా నేనొచ్చేస్తా'

నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై మితిమీరిన మమకారం, వాత్సల్యంతో చదువు నుంచి పెళ్లి వరకూ అడిగిందల్లా అందిస్తూ, ఇష్టానుసారంగా స్వేచ్ఛనిస్తూ పెంచడంతో పెళ్లయిన కొన్నాళ్లకే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం వంటివి చోటు చేసుకుంటున్నాయి. మెట్టినింటి నుంచి పుట్టింటికి నాన్నా నేనొచ్చేస్తా అంటూ చిటికెలో ప్రయాణం చేసేస్తున్న నేటి యువతకు నాన్నా మా ఇంటికి ఎప్పుడు వస్తారని ఆహ్వానం పలికేరోజులు రావాలనే సందేశంతో ప్రదర్శించిన నాటిక అమృతలహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారి 'నాన్నా నేనొచ్చేస్తా' కథాంశం. మూలకథ గంటి ఈజేశ్వరి, రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం అమృతలహరి.

విలువలే ప్రధానమన్న 'మృత్యుపత్రం'

మనిషి ప్రాణాపాయ స్థితుల్లో మానవత్వం చాటుకోవాల్సిన సందర్భాల్లోనూ డబ్బుకే ప్రాధాన్యతనిస్తూ విలువలు కోల్పోతున్న నేటి సమాజంలో ఓ ఆటో, వైద్య, పోలీసు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు సారాంశంగా ప్రదర్శించిన నాటకమే మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారి మృత్యుపత్రం. రచన, దర్శకత్వం మద్దుకూరి రవీంద్రబాబు.

బైక్ అపహరణపై కేసు నమోదు

కాళ్ల: ఇంటిముందు నిలిపిన మోటార్ సైకిల్ అపహరణకు గురవడంపై బాధితుడి ఫిర్యాదు మేరకు కాళ్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోమటిగుంటకు చెందిన మేడిది సంసోను ఈనెల 4న రాత్రి ఏపీ 39 హెచ్ఎ 7930 నంబరు గల పల్సర్ మోటార్ సైకిల్ యథావిధిగా తన ఇంటి ముందు పెట్టాడు. ఉదయం లేచి చూసే సరికి మోటార్ సైకిల్ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు తన వాహనాన్ని అపహరించారంటూ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

సార్వత్రిక విద్యాపీఠం పరీక్షలకు 2,657 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లీష్ పరీక్షకు 913 మందికి 828 మంది హాజరయ్యారు. 85 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ పరీక్షకు 1,993 మందికి 1829 మంది హాజరయ్యారు. 164 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, హై పవర్ కమిటీ, డీఈసీ కమిటీలు వివిధ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

జంగారెడ్డిగూడెం: చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు ఎస్సై ఎం.సాగర్ బాబు తెలిపారు. ఎ.పోలవరానికి చెందిన టి.నాగదుర్గారావు (16) గత నెల 31న కలుపు మందు తాగి అస్వస్థతకు గురైనట్టు తెలిపారు. టి.సోమాలమ్మ నాగదుర్గారావును పెంచుకుంటోందని అతను సెల్ ఫోన్‌తో ఆడుకుంటుండగా మందలించడంతో మన స్థాపానికి గురై కలుపు మందు తాగినట్టు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌కు అతడిని తరలించగా చికిత్స పొందుతూ శనివారం నాగదుర్గారావు మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

దాడి కేసులో నలుగురి అరెస్టు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ద్వారకానగర్‌లో మద్యం మత్తులో జరిగిన గొడవలో నలుగురిపై కేసు నమోదు చేశామని ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను ఆయన తెలిపారు. ఈనెల 3న ద్వారకానగర్‌లో మద్యం మత్తులో కొందరు వ్యక్తులు మోటారు సైకిళ్ల రోడ్డుకు అడ్డుగా పెట్టి అటుగా వెళుతున్న బీడీ కాలనీకి చెందిన పులవర్తి ధనుష్ నవీన్‌కుమార్, బంటుపల్లి గిరి నరసింహారావుపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు ఇన్‌ఛార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆదేశాలపై ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన గౌతు శేషు, నేల మధుబాబు, రావాడ దేవేంద్ర, కారు నాగరాజును పోలీసులు అరెస్టు చేశారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

క్లుప్తంగా

మంత్రి పరామర్శ



మహ్మద్ అజీబుద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: విద్యాదాత మహ్మద్ నజీముద్దీన్ హఠా న్మరణం చెందడం పట్ల రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. నజీముద్దీన్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ పరామర్శలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, గంటా నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో శనివారం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్, పెంటపాడు మండలాల్లో మొత్తం 3,331మంది విద్యార్థులకు గాను శనివారం 3,277మంది పరీక్షలు రాశారు. మరో 54మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు డీవైఈవో రవీంద్రభారతి తెలిపారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని ఈ నెల 14వ తేదిన ఘనంగా నిర్వహించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో మాలమహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అన్నివర్గాల ప్రజలకు రిజర్వేషన్లు, హక్కులు కల్పిస్తే ఒక్క ఎస్సీలు మాత్రమే అంబేడ్కర్‌ను గౌరవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ చిత్రాన్ని కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు జి.సుందర్, కె.రాజారావు, బి.మోహన్, బి.సునీల్, బి.సందీప్, ఎం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

అత్తిలి: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని అత్తిలి శివారు గోగులమ్మపేట చిన రామాలయం వద్ద శనివారం అఖండ అన్న సమారాధన జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సీతారాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


దోమల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలి



తాడేపల్లిగూడెం పట్టణం వీకర్స్ కాలనీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం పట్టణం 2, 3, 4వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో వాడేసిన టైర్లు, తాగేసిన కొబ్బరి బొండాలు ఉండరాదని, వీటిల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. రాత్రి సమయాల్లో ముప్పేట దాడి చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

చినతాడేపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీహర్ష రోగులకు వైద్య పరీక్షలు చేసి, 183మందికి ఉచితంగా మందులు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.

జగనన్నతోనే మంచి భవిష్యత్తు

- రెండోరోజు జగనన్నే మా భవిష్యత్తు ప్రారంభం
- ఈనెల 20వరకూ ఇంటింటికీ గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి రాష్ట్ర ప్రజలకు ధైర్యంగా చెప్పే కార్యక్రమమే జగనన్న మా భవిష్యత్ అని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జగనన్న మా భవిష్యత్... నమ్మకం మా జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ గత నాలుగేళ్ల కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసిన ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాబోయే 30 నుంచి 40 ఏళ్ల వరకు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. అలాగే జగన్నాథపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి గుండెల్లో సీఎం జగన్ నిలిచిపోయారన్నారు. గడప గడపకు వెళ్తుంటే సాధారంగా ఆహ్వానం పలుకుతున్నారన్నారు. వారి ఆప్యాయతానురాగాల ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ మట్టా సత్యనారాయణ, సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, నాయకులు ముప్పిడి లక్ష్మణరావు, ఉండ్రాజవరపు రాజు, మధు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అత్తిలిలో: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ ప్రభుత్వానికి ప్రజలు తిరిగి మద్దతు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అత్తిలిలో శనివారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేనంత అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మండల పార్టీ నాయకులు కంకటాల సతీష్, గంటా నాగరాజు, రంభ రాంబాబు, కుక్కల వెంకటరమణ, నరుకుల వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేటలో....

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం అత్తిలి శివారు రామన్నపేటలో నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లిన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సుజాత, చిటకన వెంకట్రావు, దాసరి శ్రీను, బాలం ప్రసాద్, పి సంపదరావు, కంకటాల సతీష్, గండి సత్య, గొర్లెరాము, కొసినీడి వాసు, కాసగాని అబ్బులు, మద్దాల శ్రీనివాస్, గంటా నాగరాజు, దాసిరెడ్డి భగవాన్, గొర్లె సూర్యారావు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని టూటౌన్ సచివాలయ కన్వీనర్ కర్రి భాస్కరరావు అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో జగనన్నే మా భవిష్యత్...మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు మొబైల్ స్టిక్కర్లు అందజేశారు. అనంతరం కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జ్ అడ్డాల నరసింహారావు, ఆలం ధనకొండ, పెనుగొండ ఆంజనేయులు, శ్రీనివాస్, టిక్కలి ధర్మరాజు, బోళ్ళ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తణుకు టౌన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకు రూరల్ మండలం దువ్వ, తేతలి, మండపాక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, గృహ మిత్రాలు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు సచివాలయాల పరిధిలోని ఇంటింటికి వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, ఉప సర్పంచ్, నాయకులు ముళ్లపూడి బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ మిత్రలు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూరు గ్రామంలో...

మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని 10వ వార్డులో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంటపాడు: జగనన్నతోనే మాభవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు రాచర్ల గ్రామంలో పార్టీ బీసీ సంఘ నాయకులు వాకా వెంకట సుబ్బారావు, చింతపల్లి గ్రామంలో పార్టీ యూత్ నాయకులు పేరిచర్ల కిరణ్‌కుమార్‌రాజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చింతన నారాయణరావు, వేములమంద జానకిరామరాజు, డాక్టర్ శ్రీను, రాచర్ల, చింతపల్లి గ్రామాల పార్టీ కార్యకర్తలు, గృహసారథులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం పట్టణం 10వ వార్డులో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం దృశ్యం



అత్తిలిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాపురం గ్రామంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న నాయకులు



మండపాకలో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



రాచర్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న బీసీ సంఘ నాయకులు వాకా వెంకటసుబ్బారావు తదితరులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

తణుకు అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సంక్షేమ పథకాలపై మక్కువతోనే ప్రజానీకం వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం 27, 28, 29 వార్డుల నుంచి మహిళలు, యువత 100 కుటుంబాలు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన వారందరినీ అక్కున చేర్చుకుంటామని వారి కష్టనష్టాల్లో అండగా నిలుస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, మల్లిపూడి నాగేశ్వరరావు, చదలవాడ సురేష్, అడ్డగర్ల శివబాబు, కొల్లు బాబు, బొల్లాడ శ్రీను, కొమ్మన నరేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారందరికీ మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పైబోయిన ఏసుబాబు, ములగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి

ఉపాధి వేతన బకాయిలను చెల్లించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం కింద ఇప్పటి వరకు పనిచేసిన రోజులకు వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ఆరుగొలను గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా పూర్తి స్థాయిలో ఉపాధి పనులు ప్రారంభించలేదన్నారు. పనిచేసిన చోట వేతనాలు రాక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

గూడెంలో రన్ ఫర్ జీసస్



తాడేపల్లిగూడెం పట్టణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఈస్టర్ పండగను పురస్కరించుకొని గాడ్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్ల పై కడకట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి యాగర్లపల్లి, పోలీస్‌ఐలాండ్ సెంటర్, పోలీస్ స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, హౌసింగ్ బోర్డు కాలనీల మీదుగా ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్స్ మినిస్ట్రీస్ జిల్లా కోర్డినేటర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు సర్వదా అనుసరణీయమని, ఆయన మార్గంలో విశ్వాసులు పయనించాలన్నారు. పవన్, సారాబాయి, రంజిత, మిత్రక్రాంతి, కిషోర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- కాకిలేరులో గడపగడపకు మన ప్రభుత్వం

ఇరగవరం: వైఎస్సార్ సీపీ హాయాంలో అర్హులైన ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారా శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఇరగవరం మండలం కాకిలేరు గ్రామంలో 78 వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి గడపకు వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాలను తెలిపే బుక్‌లెట్ అందించి వారికి చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలందరి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. మన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఏ ప్రభుత్వ అమలు చేయడంలేదు అని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షనేత చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేస్తుంటే చంద్రబాబు సహించలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంపన అంజి బాబు, సర్పంచ్ ఉన్నమట్ల నాగమణి, జవ్వాది రామోజి, ఇంటి బాబులు, కోపిల్ల కషోర్, అధికారులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాకిలేరులో గడపగడపకు మన ప్రభుత్వంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్సై జి. సత్యనారాయణ

పెంటపాడు: భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని పెంటపాడు ఎస్సై జి. సత్యనారాయణ పేర్కొన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని పెంటపాడు జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీవీఎస్ హిందూ హైస్కూల్లో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు యువత నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు దేవాబత్తుల బాబి పెంటపాడు జైభీమ్ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ

తాడేపల్లిగూడెం అర్బన్ : పోలీస్‌లు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు పూర్తైన అనంతరం వేసవి సెలవులు కారణంగా బంధువుల వద్దకు, పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న సమయంలో వారి వివరాలతో పాటు వారి గృహాల చిరునామాలను పోలీస్‌స్టేషన్లలో నమోదు చేయించుకోవాలన్నారు.గృహాల్లో ఉన్న సామగ్రిని భద్రపరుచు కోవాలని సూచనలు చేశారు. విలువైన బంగారు ఆభరణాలు ఉన్నా, లేకపోయినా పోలీసు గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేకంగా పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి రాత్రి సమయాల్లో పట్టణంలో గస్తీ తిరిగేందుకు చర్యలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

నాగేశ్వరరావు సేవలు మరువలేనివి

అత్తిలి: అజాతశత్రువు, సౌమ్యుడుగా పేరుగాంచిన స్వర్గీయ మద్దాల నాగేశ్వరరావు అత్తిలి గ్రామాభివృద్ధికి విశేష కృషిచేసారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. మాజీ ఏఎంసీ చైర్మన్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు స్వర్గీయ మద్దాల నాగేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా శనివారం అత్తిలి కెనాల్ రోడ్డులో ఆయన విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయంగా తన ఎదుగుదలకు మద్దాల ఎంతో కృషిచేసారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళ్ళులర్పిస్తున్న మంత్రి కారుమూరి

వంగవీటి మోహనరంగా వీధిగా నామకరణం చేయాలని వినతి

తణుకు అర్బన్: తణుకు సొసైటీరోడ్డును వంగవీటి మోహనరంగా వీధిగా నామకరణం చేయాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు కాపు సంఘ నాయకులు వినతిపత్రం అందచేశారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిశారు. ఈ సందర్భంగా పట్టణ కాపు సంఘ అధ్యక్షుడు వంటెద్దు ఈశ్వరప్రసాద్ మాట్లాడుతూ మా ఆరాధ్యదైవం వంగవీటి మోహనరంగా విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత మంత్రి కారుమూరికే దక్కిందని, అదే వీధిని రంగా వీధిగా నామకరణం చేయాల్సిందిగా కాపు సంఘం తరపున విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. స్పందించిన మంత్రి కారుమూరి మునిసిపల్ ఉన్నతాధికారులతో మాట్లాడి తప్పకుండా చేయిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి స్పందించిన తీరుకు కాపు సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాపు సంఘ కన్వీనర్ అడ్డాల అనంతబాబు, నాయకులు పోతుల సోమేశ్వరరావు, గాజుల కాశీ, రావి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా సచివాలయ గ్రామ సర్వేయర్లు ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో భీమవరంలో శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, హౌసీ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారుడు రౌతు రామకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులు తమ పనిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సబ్బితి రమాబాయి, చిల్లకూరి ఎంఎస్ఎస్‌టీ దుర్గరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్.రాంబాబు, కె.నాగభూషణం, కోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రోటరీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం

తణుకు టౌన్: తణుకు రోటరీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని ఈనెల 9వ తేదీన తణుకులో నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జరిగే ఈ ఆత్మీయ సమావేశానికి సభ్యులు తమ కుటుంబాల సమేతంగా హాజరు కావాలని కోరారు.